RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | గురువారం 2 -7-2026 | సంచిక: 13 | సంఖ్య: 276 పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




## అక్రమ షెడ్లకు అనుమతులు

# అక్కర్లేదా..?



2లో

### మేడ్చల్ డివిజన్-298లో యథేచ్ఛగా వెలుస్తున్న కమర్షియల్ కంపెనీ షెడ్లు

- అనుమతులు లేకుండానే నిర్మాణాలు..
- ప్రభుత్వ ఆదాయానికి గండి..
- అధికారుల మౌనంపై అనుమానాలు
- ప్రధాన రహదారుల వెంట ఇష్టారాజ్యంగా నిర్మాణాలు.. నిబంధనలు సామాన్యులకేనా..?

మేడ్చల్, జూలై 1 (నేటి ప్రస్థానం ప్రత్యేక ప్రతినిధి)

మేడ్చల్ డివిజన్-298 పరిధిలో అక్రమ కమర్షియల్ షెడ్ల నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారులు, జంక్షన్లు, పరిశ్రమల సమీప ప్రాంతాలు, కొత్తగా అభివృద్ధి చెందుతున్న కాలనీల్లో రాత్రికి రాత్రే రేకుల షెడ్లు, ఐరన్ స్ట్రక్చర్లతో కమర్షియల్ నిర్మాణాలు వెలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు జరుగుతున్నా, అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




పాలనపై చర్చకు సిద్ధం..

## తేదీ చెప్పండి

**రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్**

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటన
- తేదీ, సమయం ఖరారు చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేసిన కేటీఆర్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ చర్చకు సంబంధించిన తేదీ,



## రైతులకు తెలంగాణ సర్కార్ శుభవార్త..

# 9 రోజుల్లో 9,000 కోట్లు జమ

**రైతు భరోసా కింద 9 రోజుల్లో 9000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్న సీఎం రేవంత్**




- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సూచించిన వరి వంగడాలనే పండించాలని రైతులకు విజ్ఞప్తి
- గత 30 నెలల్లో రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం 1.75 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడి
- రైతుల సమస్యలపై అసెంబ్లీలో చర్చకు రావాలని బీఆర్ఎస్‌కు సవాల్ విసిరిన ముఖ్యమంత్రి
- కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మారిపోయిందని రేవంత్ విమర్శ

2లో

## డిజిటల్ ఇండియాతో ప్రపంచ వేదికపై భారత్

- 11 ఏళ్ల ప్రయాణంపై ప్రధాని మోదీ ప్రశంసలు
- సాంకేతిక విప్లవంతో పాలనలో పారదర్శకత పెరిగిందన్న వ్యాఖ్య
- డిజిటల్ సేవలతో ప్రజల జీవితాల్లో విస్తృత మార్పులు
- ఏఐ, సెమీకండక్టర్లు, స్టార్టప్‌లతో కొత్త దిశగా దేశం
- అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి డిజిటల్ ఇండియానే పునాది



## 'భాజపా ముక్త్ భారత్'కు ప్రజలు మొగ్గు

- బీజేపీపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శలు
- పాలనపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటన
- తెలంగాణ పర్యటనలో కీలక అంశాలపై మౌనం ఎందుకని ప్రశ్న
- 'సర్' ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేసిన కాంగ్రెస్
- భారాస నేతల వ్యాఖ్యలపైనా ఘాటు విమర్శలు




హైదరాబాద్: దేశ ప్రజల ఆకాంక్ష ఇప్పుడు 'భాజపా ముక్త్ భారత్' దిశగా ఉందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. పదేళ్ల భారాస పాలన, పన్నెండేళ్ల భాజపా



### నితిన్ నబీన్‌పై వ్యాఖ్యలతో సీఎం భయం బయటపడింది: రామచందర్‌రావు

- కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధం
- 'సర్' ప్రక్రియపై ప్రభుత్వానికే విశ్వాసం లేదు
- పార్టీలో చేరేందుకు పలువురు ఆసక్తి : రాష్ట్ర బీజేపీ చీఫ్

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# అక్రమ షెడ్లకు అనుమతులు అక్కర్లేదా..?

(మొదటి పేజీ తరువాయి)

**వారాల వ్యవధిలో షెడ్లు...**

**నెలల తరబడి అధికారుల మౌనం**

సాధారణ ప్రజలు చిన్న ఇంటి నిర్మాణానికి సైతం మున్సిపల్ అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్లాన్ ఆమోదం, పన్నులు, ఫీజులు చెల్లించకపోతే నోటీసులు జారీ చేస్తున్న అధికారులు, భారీ కమర్షియల్ షెడ్లు నిర్మిస్తున్న వారిపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వందల చదరపు గజాల్లో నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులకు తెలియకపోవడం ఎలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**కోట్ల రూపాయల వ్యాపారం...**

**ప్రభుత్వానికి మాత్రం నష్టం**

స్థానికుల సమాచారం ప్రకారం, నిర్మించిన కమర్షియల్ షెడ్లను గోదాములు, కంపెనీలు, వర్క్‌షాపులు, లాజిస్టిక్ యూనిట్లు, స్టోరేజీ సెంటర్లు, చిన్న పరిశ్రమలకు అద్దెకు ఇస్తున్నారు. ఒక్కో షెడ్డు ద్వారా నెలకు వేల నుంచి లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి రావాల్సిన అభివృద్ధి ఛార్జీలు, అనుమతి ఫీజులు, ఆస్తి పన్నులు పూర్తిగా చెల్లిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మున్సిపల్ ఖజానాకు లక్షల్లో నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



**ఎవరి అండతో అక్రమాలు..?**

ఇంత పెద్ద ఎత్తున కమర్షియల్ షెడ్లు నిర్మాణం జరుగుతున్నా ఎవరూ గుర్తించకపోవడం సాధ్యమేనా? నిర్మాణాలు ప్రారంభమైనప్పటి నుంచే అధికారులు ఎందుకు స్పందించలేదు? ఫిర్యాదులు వచ్చినా చర్యలు ఎందుకు తీసుకోలేదు? అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో బాధ్యుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

**ట్రాఫిక్ సమస్యలకు కారణం**

ప్రధాన రహదారుల పక్కనే నిర్మించిన కమర్షియల్ షెడ్ల ముందు భారీ వాహనాలు, సరుకు లారీలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. పాదచారులు రోడ్లపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అత్యవసర సేవలకు కూడా ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అగ్నిప్రమాదాల ముప్పు**

రేకులతో నిర్మించిన పెద్ద షెడ్లలో విద్యుత్ వైరింగ్, సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోతే అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. అలాంటి ప్రమాదం జరిగితే కార్మికులు, పరిసర ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల స్పందన ఏమిటి?**

మేడ్చల్ డివిజన్-298లో జరుగుతున్న కమర్షియల్ షెడ్ల నిర్మాణాలపై సంబంధిత మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**నిబంధనలు ఎవరికి..?**

భవన నిర్మాణ చట్టాల ప్రకారం కమర్షియల్ నిర్మాణాలకు ముందస్తు అనుమతి, ఆమోదిత ప్లాన్, భద్రతా ప్రమాణాలు, పార్కింగ్ సదుపాయం, అగ్నిమాపక భద్రత (అవసరమైతే), భూవినియోగ నిబంధనల అనుసరణ తప్పనిసరి. అయితే కొన్ని చోట్ల ఈ నిబంధనలను పాటించకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సమగ్ర పరిశీలన జరపాలని వారు కోరుతున్నారు.

**పట్టణ ప్రణాళికకు విఘాతం**

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందాల్సిన మేడ్చల్‌లో అనుమతులు లేని నిర్మాణాలు పెరిగితే భవిష్యత్తులో రోడ్ల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, ప్రజా సౌకర్యాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పట్టణాభివృద్ధి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**ప్రజల డిమాండ్**

డివిజన్-298లో నిర్మించిన అన్ని కమర్షియల్ షెడ్లపై ప్రత్యేక సర్వే నిర్వహించాలి. అనుమతులు ఉన్నాయా? లేవా? అనే వివరాలను బహిరంగంగా వెల్లడించాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి జరిగిన ఆదాయ నష్టాన్ని అంచనా వేసి వసూలు చేయాలి. అక్రమ నిర్మాణాలకు సహకరించిన అధికారుల పాత్రపై విచారణ జరపాలి.

భవిష్యత్తులో అక్రమ నిర్మాణాలు జరగకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి.

## డిజిటల్ ఇండియాతో ప్రపంచ వేదికపై భారత్

న్యూఢిల్లీ: డిజిటల్ ఇండియా కార్యక్రమం భారతదేశాన్ని ప్రపంచ వేదికపై కొత్త గుర్తింపుతో నిలబెట్టిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పరిపాలనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందుబాటులోకి వచ్చాయని, దేశ అభివృద్ధికి ఈ కార్యక్రమం బలమైన పునాదిగా నిలిచిందని చెప్పారు. డిజిటల్ ఇండియా ప్రారంభమై 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధాని బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సందేశం విడుదల చేశారు. డిజిటల్ చెల్లింపుల విస్తరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావడం, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ వంటి మార్పులు ప్రజల దైనందిన జీవితాన్ని మరింత సులభతరం చేశాయని వివరించారు. డిజిటల్ విప్లవం దేశంలోని మహానగరాలకే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల వరకు విస్తరించిందని ప్రధాని పేర్కొన్నారు. ఈ మౌలిక సదుపాయాల ఆధారంగా యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, ఆవిష్కర్తలు ప్రపంచ స్థాయి సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందిస్తున్నారని తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, వాణిజ్యం, ప్రభుత్వ సేవల రంగాల్లో డిజిటల్ సాంకేతికత కీలక మార్పులకు దారితీసిందని, దీంతో పాలన మరింత సమర్థవంతంగా, జవాబుదారీతనంతో సాగుతోందని మోదీ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ చర్యలతో కృత్రిమ మేధస్సు (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక రంగాల్లో కూడా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడిని సాంకేతికంగా శక్తివంతం చేయడం, సమగ్ర అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించడం, సుస్థిర భవిష్యత్తు నిర్మాణంలో సాంకేతికతను సమర్థంగా వినియోగించడం ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధ భారత నిర్మాణంలో డిజిటల్ ఇండియా కీలక పాత్ర పోషిస్తోందని, ముఖ్యంగా పేదలు, వెనుకబడిన వర్గాలకు అవకాశాలు విస్తరించడంలో ఈ కార్యక్రమం విశేషంగా దోహదపడిందన్నారు. ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ల విస్తరణ నుంచి డిజిటల్ లావాదేవీల పెరుగుదల వరకు సాధించిన విజయాలు ప్రపంచ దృష్టిని భారత్‌వైపు మళ్లించాయని పేర్కొన్న ప్రధాని, భారీ స్థాయిలో ప్రజలు సాంకేతికతను స్వీకరించినప్పుడు దేశంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు.



## రైతులకు తెలంగాణ సర్కార్ శుభవార్త..

## 9 రోజుల్లో 9,000 కోట్లు జమ

ఉన్నాయని, రైతు వేదికల వద్ద నాణ్యమైన వరి విత్తనాలను సిద్ధం చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం గత 30 నెలల కాలంలో రైతుల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. 25.35 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.20,000 కోట్ల రుణాలను మాఫీ చేశామని గుర్తుచేశారు. ఇప్పటివరకు రైతు భరోసా కింద రూ.36,000 కోట్లు జమ చేశామని, ఇందులో తాము అధికారంలోకి రాగానే విడుదల చేసిన రూ.7,000 కోట్లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం తాము నెలకు రూ.6,000 కోట్లు ఖర్చు చేస్తుంటే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకు రూ.2,000 కోట్లు మాత్రమే వెచ్చించిందని పోల్చి చెప్పారు. రైతు సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై, తమ రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అని ప్రతిపక్షానికి సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, రాష్ట్ర అప్పు రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న ఆ పార్టీ నేతల వ్యాఖ్యలను ఆయన ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ పనులను పూర్తి చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## 'భాజపా ముక్త్ భారత్'కు ప్రజలు మొగ్గు

పాలన, రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేదని విమర్శించారు. మూడు రోజుల పర్యటనలో రాష్ట్ర సమస్యలు, తెలంగాణ ఉద్యమ చరిత్ర, సామాజిక సమీకరణలు వంటి అంశాలపై ఆయన సరైన అవగాహన ప్రదర్శించలేదని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఇచ్చిన ఎన్నికల హామీలు, తెలంగాణకు రావాల్సిన అభివృద్ధి ప్రాజెక్టులు, కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు, అయోధ్య విరాళాల వ్యవహారం వంటి కీలక అంశాలపై నితిన్ నబీన్ స్పందించకపోవడం ప్రశ్నార్థకమని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణకు సముచిత స్థానం లేదా అనే సందేహం కలుగుతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ ద్వారా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించి, అనుకూల ఓటర్లను చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. భారాసపై కూడా విమర్శలు చేసిన ఆయన, ప్రతిపక్ష హోదా లభించిన తర్వాత కేసీఆర్ ప్రజా సమస్యలకు దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

### సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు

### ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల్లో ఆనందం

రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల ఒకటో తేదీనే వారి జీతాలను ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు జమయ్యాయి. గతంలో జీతాల చెల్లింపులో ఆలస్యం కావడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఏజెన్సీ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆర్థిక శాఖ జీతాల చెల్లింపును పూర్తి చేసింది. ఇకపై ప్రతి నెల 25వ తేదీలోగా జీతాల బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగాలకు పంపాలని, నెలలో చివరి పని దినానికల్లా ఆడిట్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్థిక శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## నితిన్ నబీన్‌పై వ్యాఖ్యలతో సీఎం భయం బయటపడింది: రామచందర్‌రావు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయనలో రాజకీయ ఆందోళన, అసహనం పెరుగుతున్న సంకేతాలేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ఆరోపించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌పై రైతుభరోసా సభలో చేసిన వ్యాఖ్యలు అదే విషయాన్ని వెల్లడిస్తున్నాయని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, నితిన్ నబీన్ తెలంగాణ పర్యటనకు ప్రజల నుంచి లభించిన స్పందనను చూసి కాంగ్రెస్ నాయకత్వంలో ఆందోళన నెలకొందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ బలోపేతమవుతున్న పరిస్థితులను గమనించి ముఖ్యమంత్రి స్పందిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు బీజేపీ సిద్ధంగా ఉందని రామచందర్‌రావు మరోసారి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, పాలన, అభివృద్ధి అంశాలపై వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉద్యోగులే నిర్వహిస్తున్నప్పుడు వారి పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగంపైనే నమ్మకం లేకపోతే ప్రజలకు ఏ సందేశం వెళ్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతం అవుతోందని, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## పాలనపై చర్చకు సిద్ధం.. తేదీ చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

సమయాన్ని ఖరారు చేయాలని ఆయన ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గడువులో సగం కాలం పూర్తయినా, చెప్పుకోవడానికి ఒక్క విజయం కూడా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వరి సాగు 2014-15 నాటికి ఉన్న 26 లక్షల హెక్టార్ల నుంచి, పాలన ముగిసే సమయానికి 59 లక్షల హెక్టార్లకు పెరిగిందని గుర్తు చేశారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై నిందలు వేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ. 3.5 లక్షల కోట్లు మాత్రమేనని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి 72 సార్లు ఢిల్లీ పర్యటనలు ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ, ప్రెస్ క్లబ్ లేదా జూబ్లీహిల్స్ ప్యాలెస్.. వేదిక ఏదైనా చర్చకు తాను వస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చర్చకు రేవంత్ రెడ్డి లేదా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. "ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా నిరూపించడంలో నేను విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.



## ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర ఎనలేనిది

### జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్‌కు మున్సిపల్ పాలకవర్గం ఘన సన్మానం

**గుమ్మడిదల, జూలై 1 (నేటి ప్రస్థానం ):** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుమ్మడిదల మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్‌ను మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య సంరక్షణలో వైద్యులు పోషిస్తున్న పాత్ర అమూల్యమైనదని అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా సేవాభావంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. వైద్య వృత్తి కేవలం ఉద్యోగం కాదని, అది మానవాళికి చేసే మహోన్నత సేవ అని కొనియాడారు. గుమ్మడిదల మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్ అంకితభావంతో పనిచేస్తున్నారని, ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయన కృషి ప్రశంసనీయమని చైర్మన్ తెలిపారు. డాక్టర్ మధుకర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన బాధ్యత అని, భవిష్యత్తులోనూ ఇదే సేవా దృక్పథంతో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, కౌన్సిలర్ ఆకుల మాధవి, కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, నాయకులు వెంకట్రాం రెడ్డి, హుస్సేన్, హెచ్‌ఈవో శ్రీనివాస్, వైద్య సిబ్బంది, మున్సిపల్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాత జ్ఞాపకాలకు కొత్త వెలుగు

### 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన జిన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు.. గురువులకు ఘన సన్మానం




**జిన్నారం, జూలై 1 ( నేటి ప్రస్థానం ):** కాలం గడిచినా పాఠశాల రోజుల అనుబంధాలు, గురువుల పట్ల గౌరవం ఎప్పటికీ చెరిగిపోవని జిన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999--2000 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు మరోసారి చాటిచెప్పారు. జిన్నారం మున్సిపల్ కేంద్ర సమీపంలోని ఇంద్రసేనారెడ్డి గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆప్యాయత, అనురాగాలకు వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉపాధ్యాయులు అనంతరెడ్డి, కృష్ణారెడ్డి, దశరథ రామశర్మ, యాదగిరి బిక్షపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి బాటలు వేసిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. గురువులు కూడా తమ శిష్యుల విజయాలను అభినందిస్తూ ఆశీర్వదించారు. పాత మిత్రులు 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో ఆనందోత్సాలు వెల్లివిరిశాయి. పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, అప్పటి సంఘటనలను పరస్పరం పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. విద్య అనేది జీవితానికి బలమైన పునాది అని, గురువుల మార్గదర్శకత్వమే తమ విజయాలకు కారణమని పలువురు పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సమ్మేళనాలను నిర్వహిస్తూ పరస్పర అనుబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎండలు తగ్గే వరకు ఓసీపీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలి

### ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్

కమాన్ పూర్: వేసవి తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్య రక్షణార్థం ఎండలు తగ్గే వరకు మజ్జిగ ప్యాకెట్ల సరఫరాను కొనసాగించాలని సింగరేణి కోల్మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతి పత్రం సింగరేణి ఆర్జి3 ఓసి1 గని మేనేజరు రావుల పాపయ్యకు గని కార్మికులతో కలిసి సమర్పించారు. నిబంధనల ప్రకారం ఓసీపీలలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ సమయం ముగిసినప్పటికీ, ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు, ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కార్మికులు, వారి కుటుంబాల ఆరోగ్యం, సంక్షేమం కోసం యాజమాన్యం తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తతతో వ్యవహరించాలి

### అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలి -- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





**గుమ్మడిదల (పటాన్‌చెరు) , జూలై 1(నేటి ప్రస్థానం):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు బూత్ స్థాయి ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. రామచంద్రాపురం లోని బాలాజీ గార్డెన్స్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి బూత్ స్థాయి ప్రతినిధి తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణ, చిరునామా మార్పు దరఖాస్తుల పరిశీలనతో పాటు పాత ఓటర్ల వివరాల సరిపోలికను జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణలో బూత్ స్థాయి ప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, ప్రతి అర్హుడి వివరాలు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన సదస్సులో పార్లమెంట్ సమన్వయకర్త వెన్నెల, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రామ నీటి వనరులకు ఆటంకం కలగొద్దు

### కట్టు కాలువల సహజ స్వరూపాన్ని పరిరక్షించాలి

### రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు మున్సిపల్ పాలకవర్గం వినతి

**గుమ్మడిదల, జూలై 1 (నేటి ప్రస్థానం ):** గ్రామ భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కట్టు కాలువలను పరిరక్షించి, వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ పరమేశం, ఇరిగేషన్ శాఖ అధికారి చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల ప్రభుత్వం సర్వే నంబర్--109లోని భూమిని టీజీఐఐసీకి కేటాయించిన నేపథ్యంలో, ఆ ప్రాంతం గుండా గ్రామంలోని ఎర్రచెరువుకు నీరు చేరే కట్టు కాలువపై సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. దీంతో వర్షపు నీరు సహజంగా చెరువులోకి చేరే మార్గానికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల సహజ ప్రవాహం దెబ్బతింటే భవిష్యత్తులో ఎర్రచెరువుకు నీటి చేరిక తగ్గిపోయి




గ్రామంలో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కట్టు కాలువల సహజ స్వరూపాన్ని యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే నిర్మాణాల్లో అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలని అధికారులను కోరారు. గ్రామంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, వార్డు కౌన్సిలర్ ఆకుల మాధవి, కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, నాయకులు వెంకట్రాం రెడ్డి, హుస్సేన్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### రామ్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల, జూలై 1(నేటి ప్రస్థానం ):** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలోని 11వ వార్డు రామ్‌నగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన చైర్మన్, నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పని ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా నాణ్యతతో పూర్తి కావాలని, నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. అలాగే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో




మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ప్రవీణ్ రెడ్డి, కాలనీవాసులు, సీకేజీ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో మోసం.. యువతి నుంచి నగదు కాజేసిన వ్యక్తి అరెస్ట్

**నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించిన బొల్లారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రవీందర్ రెడ్డి**



**జిన్నారం (బొల్లారం) జులై 1 (నేటి ప్రస్థానం ):** పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మహిళతో సహజీవనం చేస్తూ, ఆమెను శారీరకంగా దోపిడీ చేయడంతో పాటు పలుమార్లు డబ్బులు తీసుకుని, అనంతరం పెళ్లి చేసుకోవడానికి నిరాకరించి మోసానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీ ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పులవర్తి దుర్గ సాయిరాం సంతోష శ్రీనివాస్ (25), తండ్రి వరదరాజ స్వామి, వృత్తి క్యాటరింగ్, ప్రస్తుతం జగద్గిరిగుట్ట మగ్దమ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. బాధిత మహిళకు పెళ్లి చేస్తానని నమ్మించి బొల్లారం గ్రామంలో ఓ గది అద్దెకు తీసుకుని కలిసి నివసించాడు. ఈ క్రమంలో ఆమెను శారీరకంగా దోపిడీ చేయడంతో పాటు వివిధ అవసరాల పేరుతో నగదు తీసుకున్నాడు. అనంతరం బాధితురాలు పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయగా నిరాకరించి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు బొల్లారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రవీందర్ రెడ్డి తెలిపారు.

# దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్ లో భారత జట్టు ఘన విజయం

**ఇటబోయిన గోపాల్ యాదవ్ కు అభినందనలు వెల్లువ**







గెలుపొందిన భారత జాతీయ జట్టులో గోపాల్ యాదవ్ ఉండడం పూడూరు గ్రామంతో పాటుగా రాష్ట్రానికి ఎంతో గర్వకారణం నేపాల్ రాజధాని ఖాట్మండులో జూన్ 27నుండి ప్రారంభమైన ప్రతిష్టాత్మక దక్షిణాసియా మొదటి రాక్‌బాల్ టోర్నమెంట్ లో భారత జట్టు ఘనవిజయం సాధించింది.బుధవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ లో భారత్ జట్టు నేపాల్ పై ఘన విజయం సాధించింది. కాగా అంతకుముందు నిర్వహించిన సెమీ ఫైనల్ మ్యాచ్ లో భారత్ జట్టు శ్రీలంక పై విజయం సాధించింది. ఘనవిజయం సాధించిన భారత జాతీయ జట్టులో మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన యువకుడు ఇటబోయిన గోపాల్ యాదవ్ ఉండడం పట్ల పలువురు గ్రామస్తులు,శ్రేయోభిలాషులు,క్రీడా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.గెలుపొందిన భారతీయ జాతీయ జట్టులో పూడూరు గ్రామానికి చెందిన యువకుడు గోపాల్ యాదవ్ ఉండడం పట్ల పూడూరు గ్రామంతో పాటుగా తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణం అని పలువురు పేర్కొన్నారు.గోపాల్ యాదవ్ భవిష్యత్తు సైతం మరెన్నో అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## రైల్వే కోడూరు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

చిట్వేలి : రైల్వే కోడూరులో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేశారు. రైల్వే కోడూరు సిపిఎం పార్టీ ఆఫీసులో వారు మాట్లాడుతూ కోడూరు – వెంకటగిరి రోడ్డును పూర్తి చేస్తామని మైసూరా వారి పల్లి గ్రామ సభలో ఏడాది క్రితం డిప్యూటీ సీఎం ప్రకటించి కనీసం అమలు చేయలేదన్నారు. పండ్లకు ప్రసిద్ధి చెందిన అప్ప జ్యూస్ ఫ్యాక్టరీ ప్రభుత్వ ఆధ్వర్యంలో తెరిపించాలని, మామిడికాయ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.అధికంగా పండ్ల తోటలు పెంచుతున్న రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. కోడూరు రైల్వే అండర్ బ్రిడ్జి, రెడ్డివారి పల్లి బ్రిడ్జి నిర్మాణం పనులు గత ఐదు సంవత్సరాలుగా నత్తనడక నడుస్తున్నాయని, ప్రారంభోత్సవానికి నోచుకోలేదని వాటి నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఓబిలి. పెంచలయ్య, పి. జాన్ ప్రసాద్, పాల్గొన్నారు.

# కాలుష్య కాటుకు విలవిల్లాడుతున్న గ్రామాలు

**బొంతపల్లి -- గడ్డపోతారం -- బొల్లారం పారిశ్రామిక ప్రాంతాలపై పెరుగుతున్న ప్రజా ఆందోళన**

**కలుషితమైన భూములు, చెరువులు, భూగర్భ జలాలు... రైతులు, మత్స్యకారులు, పశుపోషకుల జీవనాధారంపై తీవ్ర ప్రభావం**

**ఇకనైనా కఠిన చర్యలు తీసుకుని పర్యావరణాన్ని కాపాడాలని అధికారులకు ప్రజల విజ్ఞప్తి**

**గుమ్మడిదల, జూలై 1 ( నేటి ప్రస్థానం ):**





ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాలలోని బొంతపల్లి, గడ్డపోతారం, బొల్లారం పారిశ్రామిక ప్రాంతాల పరిసర గ్రామాల్లో కాలుష్య సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందనే ఆందోళన స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది. పరిశ్రమల అభివృద్ధి పేరుతో సంవత్సరాలుగా కొనసాగుతున్న కాలుష్య ప్రభావం ఇప్పటికే ప్రజా ఆరోగ్యం,భూములు, చెరువులు, కుంటలు, కాలువలు, భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పటికే కలుషితమైన వ్యవసాయ భూములు**

ఈ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో సాగవుతున్న వ్యవసాయ భూములు పరిశ్రమల ప్రభావంతో ఇప్పటికే దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. కలుషిత జలాలు, రసాయన అవశేషాలు భూముల్లోకి చేరడం వల్ల నేల సారవంతత తగ్గిపోయిందని, పంటల దిగుబడులు క్రమంగా పడిపోతున్నాయని పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో గతంలో పుష్కలంగా దిగుబడులు ఇచ్చిన భూములు ఇప్పుడు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు పరిహారం అందించడంతో పాటు ఇకపై మరింత కాలుష్యం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**చెరువులు, కాలువలు, వాగులు ప్రమాదంలో..**

పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు చెరువులు, కుంటలు, కాలువలు, వాగుల్లోకి చేరి జలవనరులను కలుషితం చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని చెబుతున్నారు. కొన్ని పరిశ్రమలు వర్షపు నీటిని అవకాశంగా తీసుకుని రసాయన వ్యర్థాలను వర్షపు ప్రవాహాల్లో కలిపి బయటకు విడుదల చేస్తున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇలాంటి చర్యలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మత్స్య సంపద క్షీణత... ఉపాధి కోల్పోతున్న కుటుంబాలు**

చెరువులు, కుంటల్లోకి చేరుతున్న కాలుష్య జలాల కారణంగా చేపల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు చేపల మరణాలు కూడా చోటుచేసుకుంటున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్న అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని పేర్కొంటున్నారు. మత్స్య సంపదను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు సహాయం అందించాలని కోరుతున్నారు.

**భూగర్భ జలాలు కలుషితం... ప్రజారోగ్యంపై ముప్పు**

గ్రామాల్లోని బోర్ల నీటి నాణ్యత గణనీయంగా మారిపోయిందని స్థానికులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి రంగు, వాసనలో మార్పులు కనిపిస్తున్నాయని, తాగునీటి సమస్య తీవ్రమవుతోందని పేర్కొంటున్నారు. కలుషిత నీటి వినియోగం వల్ల ప్రజల్లో చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, జీర్ణకోశ వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూగర్భ జలాల కాలుష్యాన్ని అరికట్టేందుకు శాశ్వత ప్రణాళిక రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు.

**కాలుష్య నియంత్రణలో వైఫల్యంపై ప్రశ్నలు**

పరిశ్రమల్లో ఏర్పాటు చేసిన వ్యర్థ జల శుద్ధి కేంద్రాల పనితీరుపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ నిబంధనలు అమలవుతున్నాయా లేదా అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. శుద్ధి చేయని వ్యర్థాలను బయటకు విడుదల చేసే పరిశ్రమలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**శాస్త్రీయ అధ్యయనం -- ప్రజలకు వాస్తవాల వెల్లడి అవసరం**

బొంతపల్లి, గడ్డపోతారం, బొల్లారం ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, వాగులు, భూగర్భ జలాల నుంచి నమూనాలు సేకరించి శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కాలుష్య స్థాయిపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రజలకు వెల్లడించాలని, ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఇకనైనా కఠిన చర్యలు తీసుకోవాలి**

ఇప్పటికే జరిగిన నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో మరింత కాలుష్యం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చెరువులు, కాలువలు, వాగులను రక్షించే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, భూగర్భ జలాల కాలుష్యాన్ని తగ్గించే చర్యలు అమలు చేయాలని కోరుతున్నారు. పరిశ్రమల పరిసరాల్లో గ్రీన్ బెల్ట్‌ను విస్తరించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచిస్తున్నారు. పరిశ్రమలు ఉండాలి... కానీ ప్రజల ప్రాణాలు, పంటలు, పశువులు, జలవనరులు బలి కావొద్దు. ఇప్పటికే జరిగిన నష్టాన్ని గుర్తించి, ఇకపై కాలుష్యం పెరగకుండా ప్రభుత్వం, అధికారులు, పరిశ్రమలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రైతులు, మత్స్యకారులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### పశువుల ప్రాణాలకూ ముప్పు

కాలుష్య ప్రభావం కేవలం మనుషులకే పరిమితం కాకుండా పశుసంపదపై కూడా పడుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. చెరువులు, కాలువలు, గుంతల్లో నిల్వ ఉండే కలుషిత నీటిని తాగి పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా సంభవించాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆధారమైన పశుసంపదను కాపాడేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





# కూకట్‌పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

**హైదరాబాద్:** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అమీన్‌పూర్‌లోని ఓ హోటల్లో మూసాపేట్కు చెందిన లక్ష్మీ (50) ఉద్యోగం చేస్తోంది. బుధవారం ఆమె బైక్పై విధులకు వెళ్తుండగా, కూకట్‌పల్లి పోలీసు స్టేషన్ ముందే ఒక కాలేజీ బస్సు ఆమె బైక్ను ఢీకొట్టింది. దీంతో లక్ష్మీ కింద పడిపోగా, ఆమెపై నుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

## చర్లపల్లి చెరువు రిస్టేరేషన్ కార్యక్రమం: హజరయిన ఎమ్మెల్యే బండారి

హైదరాబాద్: చర్లపల్లి చెరువు రిస్టోరేషన్ భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా హాజరయ్యారు. అలాగే ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జైళ్లశాఖ ఉన్నతాధికారులు, ఐఓసీఎల్ అధికారులు, పలువురు నాయకులు, కార్యకర్తలు, జైలు సిబ్బందికి, ఖైదీలు(ఆశ్రమ వాసులు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ చర్లపల్లి చెరువును సుందరీకరణలో భాగంగా అన్నివిధాలుగా అభివృద్ధి చేసి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సీసీ కెమెరాలు అమర్చి నిరంతరం నిఘా వేసి చెత్త డంపు చేయకుండా, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ వేసి లైట్లు అమరుస్తామని తెలిపారు. చిన్నపిల్లలతో పాటు అందరికీ ఆటవిడుపుకోసం కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ఈ చెరువులో మత్స్యకారులకోసం చేపలు పెంచి వారి అభివృద్ధికి తోడ్పడతామని హామీ ఇచ్చారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/